క్లుప్తంగా

తూర్పులో 15 నామినేషన్లకు ఆమోదం

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గంలో 15 నామినేషన్లను ఆమోదించినట్టు జాయింట్ కలెక్టర్, నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ శుక్రవారం ప్రకటించారు. ఎనిమిది నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా వేసిన ముల్లపూడి నాగజ్యోతి, వెలగపూడి సుజన, గుత్తుల మోనిక నామినేషన్లను తిరస్కరించామన్నారు. జైభారత్ నేషనల్ పార్టీ నుంచి కోన శ్రీనివాసరావు, స్వతంత్ర అభ్యర్థి ఇ.సురేష్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి ఇ.రజనికి చెందిన నామినేషన్ పత్రాలపై ప్రతిపాదకుల సంతకాలు సరిగా లేనందున వాటిని తిరస్కరించినట్లు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థి ఎస్.సుశీల నామినేషన్ పత్రంలో అవసరమైన ప్రతిపాదకుల సంతకాలు లేనందున తిరస్కరించామన్నారు. మరో స్వతంత్ర అభ్యర్థి వాకుమల్లి గోవింద నామినేషన్ పత్రంలో అభ్యర్థి సంతకం లేకపోవడంతో తిరస్కరించినట్టు చెప్పారు. ప్రస్తుతం 15 నామినేషన్లు ఆమోదించినట్లు వెల్లడించారు. వాటిలో ఎన్ని నామినేషన్లు ఉపసంహరించుకుంటారో, ఎంత మంది అభ్యర్థులు బరిలో పోటీకి నిలుస్తారో ఈ నెల 29న తేలనుంది.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



బైకు ర్యాలీ చేస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

బీచ్ రోడ్డు: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ వివిధ శాఖల ఉద్యోగులు శుక్రవారం తలపెట్టిన బైకు ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఎంవీపీ కాలనీలోని ప్రగతి భవన్ నుంచి ఆర్కే బీచ్ వరకు ఈ రాలీ కొనసాగింది. ఎస్వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు ప్రగతి భవన్‌లో వివిధ శాఖలు ఉద్యోగులు ఈ ర్యాలీ నిర్వహించారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు



మధురవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

మధురవాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సువిశాల వాతావరణంలో, అధునాతన తరగతి గదులు, ఆట స్థలం, డిజిటల్ బోర్డులు, తదితర వసతులతో బక్కన్నపాలెం నవోదయ స్కూలు వెనుక కళాశాల ఉందని చెప్పారు. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, నిష్ణాతులైన అధ్యాపకులు, ల్యాబొరేటరీ వున్నాయని చెప్పారు. ఈ ఏడాది ఇంటర్‌లో 18 మంది అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98498 83416, 95504 92036లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి కోరారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రం, అభిషేక సామగ్రిని అర్చకులు ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భావితరాల భవిత కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 28వ వార్డులో మేము సిద్ధం సభకు విశేష స్పందన



ఫ్యాన్ గుర్తు చూపిస్తూ మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: భావితరాల భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కోరారు. చంద్రబాబు అబద్ధపు మాటలు విని రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయొద్దన్నారు. శుక్రవారం జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లో జరిగిన మేము సిద్ధం సభకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన చేరువ చేసేందుకు వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెడితే చంద్రబాబు తన కుట్రతో వలంటీర్లను విధులు నిర్వహించకుండా అడ్డుపడ్డారని ధ్వజమెత్తారు. ఇటువంటి దగాకోరు టీడీపీ నాయకులను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వెనకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసేందుకు విశాఖను పరిపాలన రాజధాని చేస్తే దానికి కూడా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించి తీరాలన్నారు. తూర్పు నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి నియోజకవర్గాన్ని పట్టించుకున్న దఖాలాలు లేవన్నారు. గడిచిన ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా తూర్పు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసిందన్నారు. వార్డుల అభివృద్ధి కోసం విశేష కృషి జరిగిందన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ఆగలేదన్నారు. ప్రతి ఇంటికి మంచి చేసిన జగనన్నకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను తూర్పు ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఎంవీవీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



మేము సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహితకు కొత్త జీవితం



రెడ్‌క్రాస్, పోలీసు పర్యవేక్షణలో పిల్లలతో రుగుల దేవి

ఎంవీపీ కాలనీ: రెడ్ క్రాస్ సంస్థ, త్రీటౌన్ పోలీసుల చొరవతో ఓ వివాహితకు కొత్త జీవితం లభించింది. మల్కాపురానికి చెందిన రుగుల దేవికి ముగ్గురు పిల్లలు. మద్యానికి బానిసైన భర్త కుటుంబ బాధ్యతను విస్మరించడంతో పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవడానికి ఇటీవల ఆర్కే బీచ్‌కు చేరుకుంది. అనుమానాస్పదంగా పిల్లలతో తిరుగుతున్న ఆమెను దిశా పోలీసులు గుర్తించి త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు ఆమెతో పిల్లలను పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించారు. రెడ్ క్రాస్ హోం నిర్వాహకుడు మురళీ చొరవతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు.. దేవికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కమిటీ ప్రతినిధులు అచ్యుతాపురంలోని ఐసీహెచ్‌ఏ ఫౌండేషన్ నిర్వాహకులను సంప్రదించి పరిస్థితి వివరించడంతో దేవిని ఆదుకునేందుకు ఆ ఫౌండేషన్ ముందుకొచ్చింది. దేవికి ఉపాధిని కల్పించడంతో పాటు పిల్లలకు విద్యనందించేందుకు సహకారం అందిస్తామని ఆ సంస్థ వెల్లడించింది. దీంతో రెడ్ క్రాస్ సంస్థ దేవితో పాటు ఆమె పిల్లలను శుక్రవారం అచ్యుతాపురం తీసుకెళ్లి అప్పగించింది. ఈ నేపథ్యంలో త్రీటౌన్ పోలీసులు, రెడ్ క్రాస్ హోం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సేవలను ఉన్నతాధికారులు అభినందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వై.శివనగర్‌రెడ్డి, కార్యదర్శి రవికుమార్ ఆయా సంస్థల చొరవను ప్రశంసించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా గాయత్రీ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం జిల్లాలో వివిధ హోదాలలో నాయకులను నియమించింది. ఇందులో భాగంగా విశాఖ జిల్లా జనరల్ సెక్రటరీగా తూర్పు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు కె.గాయత్రీని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

స్క్రాప్ వ్యాను దగ్ధం



దగ్ధమవుతున్న వ్యాను

అక్కిరెడ్డిపాలెం: స్క్రాప్ వ్యాను దగ్ధమైన సంఘటన రాంనగర్‌లో చేటుచేసుకుంది. గాజువాక ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం అక్కయ్యపాలెం నుంచి ఐరన్ స్క్రాప్‌తో వ్యాను రాంనగర్‌లోని స్క్రాప్ ఇండస్ట్రీస్‌కు వస్తుంది. ఈ సమయంలో వ్యాను నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వ్యాను డ్రైవర్ వ్యాను వదిలి దూరంగా వెళ్లి పోయాడు. వ్యాను పూర్తిగా దగ్ధమైందని ఎస్ఐ తెలిపారు.

ప్రజా మద్దతుతోనే ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకున్నా..

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ అభ్యర్థి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి కేఏపాల్ వెల్లడించారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మద్దతుతోనే ప్లాంట్ అమ్మకం అడ్డుకున్నానని తెలిపారు. హైకోర్టుకు 60 సార్లు హాజరయ్యానని చెప్పారు. ఉక్కు ప్రైవేటీకరణ ఆపానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో జ్యోతి, ఏసుపాదం రవికుమార్, సుభాకర్ పాల్గొన్నారు.

కళాకారులకు ఆత్మీయ సత్కారాలు



సత్కారం పొందిన కళాకారులతో అతిథులు

సీతమ్మధార : రంగసాయి నాటక గ్రంథాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా పలువురు కళాకారులకు ఆత్మీయ సత్కారాలు జరిగాయి. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల నటీమణి, కందుకూరి, గరుడ అవార్డు గ్రహీత, దర్శకురాలు హుస్సేన్ జహాన్ బేగం, పౌరాణిక కళాకారిణి, సంగీత దర్శకురాలు, నంది అవార్డు గ్రహీత బగాది విజయ సారథి, రచయిత, నటుడు, దర్శకుడు, కందుకూరి బంగారు నంది అవార్డు గ్రహీత, జర్నలిస్టు డేవిడ్ రాజ్, రచయిత, నటుడు, చిత్ర దర్శకుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కంద్రాతి సాంబశివరావు తదితరులను ఆత్మీయ సత్కారాలతో గౌరవించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయితో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం బీచ్‌కు కొట్టుకొచ్చింది. ఆరిలోవ ఏఎస్ఐ నర్సింగ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోడుగుళ్లపాలెం దరి సీతకొండ సమీప వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ వద్ద ఓ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చినట్లు శుక్రవారం రాత్రి స్థానికుల ద్వారా ఆరిలోవ పోలీసులకు సమాచారం అందింది. వెంటే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ సుమారు 35 సంవత్సరాలు మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. కాళ్లకు మెట్లు ఉండటంతో వివాహితగా నిర్ధారించారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నర్సింగ్ తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు ఎవరైనా పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఉద్యోగాలకు 4న ఇంటర్వ్యూలు

బీచ్ రోడ్డు : విశాఖనగరంలోని కోవలెన్స్ డిజిటల్ సంస్థలో బేక్ ఎండ్ డెవలపర్ ఉద్యోగాలకు వచ్చే నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సంస్థ సీఓఓ శ్రీనివాస్ పొన్నగంటి ఒక ప్రకటనలో తెలిపారు. కోర్ జావా, జే2ఈఈ, స్ప్రింగ్ బూట్, మల్టీ థ్రెడింగ్, డిజైన్ పాట్రెన్, క్లౌడ్, డేటా మ్యాపింగ్, వెబ్ సర్వీసు కోర్సుల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మే 4న ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వీఐపీ రోడ్డులోని కోవలెన్స్ డిజిటల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థలే ఆయువుపట్టు



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు రామస్వామి

అగనంపూడి: దేశానికి ఆయువుపట్టు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1170వ రోజు ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వరంగ సంస్థను కేంద్రం అమ్మజూపితే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఘటించాలని కోరారు. లేకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, వ్యతిరేక విధానాలు గొడ్డలిపెట్టు వంటివన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఒకరిద్దరి చేతుల్లో పెట్టాలనుకుంటే ఉప్పెన తప్పదని, ఆ ఉప్పెనలో కేంద్ర పాలకులు కొట్టుకుపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో మధుబాల షూటింగ్



ఆలయ ఆవరణలో షూటింగ్ సన్నివేశం

పెదగంట్యాడ: వుడా కాలనీ వినాయకనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం షూటింగ్ సందడి నెలకొంది. ఆలయం ప్రాంగణంలో 'మధుబాల' చిత్రానికి సంబంధించిన ముహూర్తపు సన్నివేశాన్ని శుక్రవారం చిత్రీకరించారు. 'తస్మాత్ జాగ్రత్త' చిత్ర దర్శకుడు ఉదయ్ కుమార్ కెమెరా స్విచాన్ చేయగా, మరో డైరెక్టర్ దేవకార్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు భూక శివ, రచయిత జీవన్ జీఆర్ మాట్లాడుతూ ఇది ఓ ప్రేమకథా చిత్రమన్నారు. నర్సీపట్నంలోని ఓ చిన్న పల్లెలో చిత్రాన్ని చిత్రీకరిస్తామని చెప్పారు. మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నామని, ఒక్కో సన్నివేశం ఆలోచింపజేసేలా ఉంటుందని తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామన్నారు. గోపీ కృష్ణ హీరోగా, శివ ప్రసన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి నిస్సీ సంగీతం అందిస్తున్నారు.

ఏయూ సమాచారమ్

లింగ వివక్షపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆచార్యులు కె.రాజమాణిక్యం రచించిన బియాండ్ ట్రెడిషన్స్- థామస్ దళిత ఫెమినిజం అండ్ ద ఛాలెంజ్ డిస్పారిటీస్ ఇన్ సౌత్ ఇండియన్ సొసైటీ పుస్తకాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య వినుత, తదితరులు పాల్గొన్నారు. దక్షిణ భారతదేశంలో లింగ అసమానతలను నిశితంగా పరిశీలించి అధ్యయనం చేసి దానిపై సమగ్ర వివరాలతో రూపొందించిన పుస్తకంగా ఇది నిలుస్తుందని రచయిత రాజమాణిక్యం తెలిపారు. భారతీయ దళిత స్త్రీల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాలని తెలిపేలా ఉంటుందన్నారు.

ఐపీఆర్‌లో పీజీ డిప్లమా కోర్సు



కోర్సు బ్రోచర్‌ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మేథో హక్కులపై పీజీ డిప్లమా కోర్సును ప్రారంభించారు. ఈ మేరకు బ్రోచర్‌ను అంతర్జాతీయ మేథో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అత్యధికంగా పేటెంట్‌లు సాధించిన ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, టి కాప్స్ ఈ నిర్వాహకులు వై.రవికిరణ్, ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డిలను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. అంతర్జాతీయ మేథో హక్కుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలను ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీలు ఆచార్య బీల సత్యనారాయణ, ఆచార్య జి.ఎస్.ఎన్ రాజు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ప్రిన్సిపాల్లు, డీన్‌లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 30న బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాల వేదికగా శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేసినప్పుడే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. దీన్ని సమాజ హితం కోరే ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఇందుకు సమన్వయంతో పని చేయాలని కోరారు. నేటి పౌరులకు విద్య, ఆవాసం, ఆశ్రయం అందించినప్పుడే వారి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దగలమన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు నగరంలో పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- వార్డుల్లో పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం



17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గేదెల నాగరాజు, తదితరులు



18వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం శుక్రవారం 18వ వార్డులో జోరుగా సాగింది. 97వ రోజు 18వ వార్డు అప్పుఘర్, మూలపాలెంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆదరించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే అందుకు ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలని కోరారు. విద్య, వైద్యం, సంక్షేమం విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పు తీసుకొచ్చిందన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని, అభివృద్ధిని చేరువ చేశామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను తూర్పు ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ చందర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, వాసుపల్లి జానకీరామ్, వాసుపల్లి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో..

వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి మద్దతుగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి, 17వ వార్డు నాయకుడు గేదెల నాగరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 17వ వార్డు 158వ పోలింగ్ బూత్ పరిధిలో వైస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మరోసారి వైఎస్సార్‌సీపీ సర్కారుకు అవకాశం కల్పించాలని కోరారు.

నేడు 'సామాజికం' సీఎస్సార్-2024 సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూధనరావు

దాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 'సామాజికం' సీఎస్సార్-2024 సదస్సు విశాఖలో ఈ నెల 27న నిర్వహించనున్నట్టు రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సీఏ డి. మధుసూదనరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు నేతృత్వంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. హోటల్ నోవాటెల్ వేదికగా శనివారం సాయంత్రం నిర్వహించనున్న సీఎస్సార్ సదస్సులో ముఖ్యంగా సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిరుపేద మహిళలు, చిన్నారులు, అనాథలకు సహాయ సహకారాలు అందివ్వడమే లక్ష్యంగా సదస్సు ఉంటుందన్నారు. ముంబై డిప్యూటీ రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ సాయిశంకర లండా, పీడీజీ శ్యామ్ మొవ్వ, సంజాయి పవర్‌మర్, ఆర్. వెంకటరమణ, పలవురు ప్రముఖులు పాల్గొని చర్చించనున్నట్టు చెప్పారు.